



RNI NO: APTEL/25/A4894

# ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిష్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 134 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిల్ల మోహన్ | ఆదివారం 26 - 07 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor




- ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని పథకం
- ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక హెల్త్ ఐడీలు
- వ్యాధులు రాకముందే గుర్తించే సంజీవని
- ఏఐ, టెలిమెడిసిన్‌తో ఆధునిక వైద్య సేవలు
- ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుంది
- రాష్ట్రంలో 80 లక్షల మందికి తీవ్ర వ్యాధులు
- ఆరోగ్యం.. సంక్షేమం.. అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు
- బ్లాక్‌చైన్‌తో భూ రికార్డుల రీసర్వే
- రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తి

# ఆగస్టు నుంచి 'సంజీవని'

## సద్వినియోగం చేసుకోండి: సీఎం చంద్రబాబు

**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "మీ ఆరోగ్యం.. మీ బాధ్యత" అని ప్రజలకు పిలుపునిచ్చిన ఆయన, ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరిలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమం బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఆధునిక సాంకేతికతను జోడించి రూపొందించిన ఈ ప్రాజెక్టు విశిష్టతలను ప్రజలకు వివరించారు.

**సంజీవని.. సమగ్ర ఆరోగ్య వ్యవస్థ :** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. విద్య, వైద్యంపైనే ప్రతి కుటుంబం అధికంగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో, ప్రజల ఆరోగ్య బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్

# ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్

- ఇందిరమ్మ ఇళ్ల సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్
- 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు, ఇతర పత్రాలు అవసరం లేదు
- ఇల్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్ వెనక్కి వస్తుంది
- లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ

**తెలంగాణ, ఉష శ్రీ**

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి అపోహలకు తావులేకుండా పూర్తి సమాచారం



# వైసీపీపై నిప్పులు అధికారులకు క్లాస్...

నిర్లక్ష్యానికి చోటు లేదు.. అధికారులకు చంద్రబాబు వార్నింగ్
వైసీపీ పాలనపై తీవ్ర విమర్శలు.. రాయలసీమపై ఫోకస్
తాగునీరు, ఆర్టీసీ సేవలపై అధికారులకు సీఎం క్లాస్
పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవన్న చంద్రబాబు

**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో నిర్లక్ష్యానికి, అలసత్వానికి చోటు లేదని గట్టిగా హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం



# స్మగ్లర్లతో చేతులు కలిపిన ఫారెస్ట్ అధికారి

రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు బీట్ ఆఫీసర్ అరెస్ట్
అధికారుల పాత్ర ఉంటే కఠిన చర్యలు తప్పవన్న పవన్ కల్యాణ్
ప్రధాన సూత్రధారుల అరెస్టుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు



**ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ**

ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే వారు ఎవరైనా సరే, ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే మరింత కఠినంగా

# యువత జయం

- నీట్-యూజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- ఇది యువత సాధించిన విజయమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ హర్షం
- యువత గొంతును ఎప్పటికీ ఎవరూ అణచివేయలేరని ప్రియాంక వ్యాఖ్య



**జాతీయం, ఉష శ్రీ**

నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు. శనివారం తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తీరుపై




# ధర్మేంద్ర రాజీనామా

## కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి

నీట్ పేపర్ లీక్ వివాదంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం
విద్యాశాఖ అదనపు బాధ్యతలు ప్రహ్లాద్ జోషికి అప్పగింత
నిరసనల ఒత్తిడితో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ గుడ్‌బై
జాతీయ విద్యా విధానంపై ధర్మేంద్ర ప్రధాన్‌కు జోషి ప్రశంసలు

**జాతీయం, ఉష శ్రీ**

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వివాదం కేంద్ర మంత్రివర్గంలో కీలక మార్పుకు దారితీసింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. అనంతరం, ఆయన స్థానంలో సీనియర్ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకుంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆయన తన రాజీనామాను సమర్పించారు. ప్రధానమంత్రి సలహా మేరకు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(2) ప్రకారం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి తక్షణమే ఆమోదించారు. నూతన విద్యాశాఖ మంత్రిగా నియమితులైన 64 ఏళ్ల ప్రహ్లాద్ జోషి, కర్ణాటకలోని ధార్వాడ్ లోక్‌సభ నియోజకవర్గం

# ధర్మేంద్ర రాజీనామా



నుంచి 2004 నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా (2019–2024) సమర్థంగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఆహార (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన), పునరుత్పాదక ఇంధన (పీఎం సూర్య ఘర్ యోజన) శాఖల మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కర్ణాటకలో మధ్యాహ్న భోజన పథకాలతో ఆయనకు గతంలో అనుబంధం ఉంది. ఈ నియామక ప్రకటన వెలువడే సమయానికి ప్రహ్లాద్ జోషి తన నియోజకవర్గంలో పర్యటనలో ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఆయన పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని, హుబ్లీ నుంచి రాత్రి 7:30 గంటల విమానంలో ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, ధర్మేంద్ర ప్రధాన్ పదవీకాలంలో నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ 2020) అమలుతో పాటు అనేక సంస్కరణలు జరిగాయని ప్రశంసించారు.

# యువత జయం



విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు. నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉద్ధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.

# ఇందిరమ్మ ఇళ్ల కాల్ సెంటర్



అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రజలు దళారులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారం పొందాలని సూచించారు. ఈ కాల్ సెంటర్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందిస్తుందని తెలిపారు.

**దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు :** దరఖాస్తు చేసుకునే సమయంలో కేవలం ఆధార్ నంబర్ ఉంటే సరిపోతుందని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ సమయంలో ఆ పత్రాలను సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో రూ.10,000 ఈఎండీని కేవలం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని తెలిపారు. ఒకవేళ లాటరీలో ఇల్లు కేటాయించకపోతే, ఆ మొత్తం తిరిగి అదే ఖాతాకు జమ అవుతుందని భరోసా ఇచ్చారు.



**అర్హతలు, ప్రయోజనాలు :** హైదరాబాద్ క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని మంత్రి వివరించారు. దరఖాస్తుదారుడికి గానీ, కుటుంబ సభ్యులకు గానీ ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదన్నారు. సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1బీహెచ్‌కే ఫ్లాట్‌ను నిర్మిస్తున్నామని, దీని మార్కెట్ విలువ రూ.40-60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనుండగా, లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య వాటా (ఖణా) స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పొంగులేటి తెలిపారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హుల సంఖ్య ఎక్కువగా ఉంటే లాటరీ ద్వారా పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

# ఆగస్టు నుంచి 'సంజీవని'

ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు. కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ-ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలిమెడిసిన్, రిమోట్ కేర్ వంటి సేవలను కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు.



**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట :** ప్రజారోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రీసర్వే చేపడుతున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి, రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు.. సాగునీటిపై హామీ :** గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ నేతలు ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదని, ఒక్క పరిశ్రమ తేలేదని చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు చేయని వారే ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వేదవతి ప్రాజెక్టును రూ.1,768 కోట్లతో పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని తెలిపారు.

**ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్‌ను :** సభ అనంతరం అదే వేదికపై నుంచి ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాను గత పాలకుల్లా పరదాలు కట్టుకుని, చెట్లు నరికించి సభలు పెట్టడం లేదని, ప్రజల మధ్యకు నేరుగా వస్తున్నానని అన్నారు. సీఎం అంటే సచివాలయంలో కూర్చునే చీఫ్ మినిస్టర్ మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండే కామన్ మ్యాన్ అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును సీఎం అందజేశారు.







# వైసీపీపై నిప్పులు అధికారులకు క్లాస్...

జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతో పాటు, ప్రభుత్వ అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాధనం వృథా అయినా, ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

**ప్రతిపక్షంపై తీవ్ర విమర్శలు :** గత ఐదేళ్ల పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, తాము రెండేళ్లలోనే ఇరిగేషన్‌పై రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, వారు ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చంద్రబాబు ఆరోపించారు. "బాబాయిని గొడ్డలితో లేపేసి, ఆ కేసును మా మీదకు నెట్టి సానుభూతితో ఓట్లు సంపాదించుకోవాలని చూశారు. ఇకపై అలాంటి నీచ రాజకీయాలు సాగవు. రౌడీయిజం చేసే వారిని, ఆడబిడ్డల జోలికి వచ్చేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. శాంతిభద్రతల పరిరక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది" అని చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు ఉండేవని, తమ పాలనలో శాంతిని నెలకొల్పామని గుర్తుచేశారు.

**అధికారుల పనితీరుపై అసహనం :** అనంతరం, నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 42 రకాల సేవలపై తన వద్ద ఉన్న డేటాను ప్రస్తావిస్తూ, పలువురు అధికారుల పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్లపై గుంతలు, రీసర్వే, మధ్యాహ్న భోజనం, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ వంటి అంశాల్లో ఆలూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని గణాంకాలతో సహా వివరించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంపై సంబంధిత అధికారిని నిలదీసిన సీఎం, "మీ పరిస్థితి బాగాలేదు. మళ్లీ వస్తా.. పరిస్థితి మారకపోతే చాలా సీరియస్‌గా ఉంటుంది. అవసరమైతే ట్యాంకర్లు పెట్టండి, కానీ ప్రజలకు నీళ్లు ఇవ్వాల్సిందే" అని ఆదేశించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా సరిగా లేవన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, "మీరు ఆంధ్రాలో ఉన్నారో, కర్ణాటకలో ఉన్నారో అర్థం కావడం లేదు. నెల రోజుల్లో పరిస్థితి మారకపోతే మీ కథ వేరేగా ఉంటుంది" అని ఆర్టీసీ అధికారికి వార్నింగ్ ఇచ్చారు. తాను ఇంత కష్టపడుతుంటే క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలోనే, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, శాప్ వంటి కొన్ని శాఖల పనితీరును ప్రశంసించడం గమనార్హం. ప్రజలకు మెరుగైన పాలన అందించే వరకు తన పోరాటం ఆగదని చంద్రబాబు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.



# స్మగ్లర్లతో చేతులు కలిపిన ఫారెస్ట్ అధికారి

వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు 'ఆపరేషన్ అరణ్య'ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని ఆయన తెలిపారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలంలో శనివారం రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఆయన అటవీ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు వారికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. శనివారం తెల్లవారుజామున వరికుంట్ల గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారంతో వాహనాలను తనిఖీ చేశారు. ఇంటి సామాగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ ట్రక్కులో దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి నుంచి వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడు ఈ ముఠాకు సహకరిస్తున్నట్లు తేలడంతో అతడిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వెనుక బెంగళూరు, హర్యానా, కోల్‌కతా కేంద్రాలుగా పనిచేస్తున్న ప్రధాన సూత్రధారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన సూత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడి పాత్రపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని సూచించారు.



## కేజీబీవీ ని తనిఖీ చేసిన కలెక్టర్



చేగుంట జులై 25 ( ఉష శ్రీ రిపోర్టర్ ) చేగుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం శనివారం జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు అందు తున్న భోజనాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు, భోజనం తయారీ విధానం నిత్యవసర సరుకులు, కూరగాయలు పరిశీలించారు. శుభ్రత పాటించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

## సమీక్ష సమావేశం... ప్రత్యేక అధికారి సాహితీ





మాడుగులపల్లి జూలై 25 ఉష శ్రీ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి సాహితి శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ పలు అంశాలపై తాగునీటి సరఫరా వర్షపు నీటి సంరక్షణ వ్యవసాయం ఉధ్వన వన శాఖ వన మహోత్సవం గుడిసెల స్థితి ధ్రువీకరణ స్వచ్ఛభారత్ మిషన్ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం గ్రామ సంఘం భవనం అంశాలపై సమావేశం నిర్వహించినారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్ సరోజ పావని మండల పంచాయతీ అధికారి సంగీత పి ఆర్ ఏ ఈ మధు ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి ఎపిఎం మధు హౌసింగ్ ఏఈ సౌమ్య ఏఈఓ నితిన్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

## మండల పార్టీ అధ్యక్షుడిగా కొర్ర నాగు నాయక్...



దామరచర్ల ఉష శ్రీ ప్రతినిధి జులై 25. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ మండల కమిటీలు నియామకం జరిగింది. దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా కొర్ర నాగు నాయక్ ను నియమిస్తున్నట్లు డిసిసి అధ్యక్షులు పున్న కైలాసనేత ప్రకటనలో తెలిపారు. దామరచర్ల మండల పార్టీ అధ్యక్షులుగా నాపై గౌరవించి నన్ను నియమించినందుకు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుల వారికి మరియు డిసిసి ఎమ్మెల్యే ఎమ్మెల్సీ లకు కొర్ర నాగు నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. మండలం వ్యాప్తంగా 35 గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు గా ఛాయా శక్తులుగా కృషి చేస్తానని తెలిపారు.



## కలప అక్రమ రవాణాను నివారించండి



పోలవరం జిల్లా ఉష శ్రీ ప్రతినిధి 25.07.2026 రంపచోడవరం కేంద్రంగా గత ఐదారు సంవత్సరాలుగా అక్రమ కలప రవాణా విచ్చలవిడిగా సాగుతోందని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం శోచనీయమని మాజీ మండల యువజన అధ్యక్షుడు, రంపచోడవరం నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ సుధీర్ రాజ్ రాపాక ఆవేదన వ్యక్తం చేశారు. ?ఈ సందర్భంగా ఆయన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేస్తూ కొన్ని ముఖ్య విషయాలను వెల్లడించారు: అధికారుల నిర్లక్ష్యం: పత్రికల్లో వార్తలు వచ్చినా, సోషల్ మీడియాలో ఆధారాలతో కూడిన ఫోటోలు ప్రచారమవుతున్నా అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



రోడ్ల ధ్వంసం: టన్నుల కొద్దీ బరువైన కలపతో కూడిన వాహనాలు ప్రయాణించడం వల్ల, రెండేళ్ల క్రితమే నిర్మించిన రోడ్లు పూర్తిగా పాడైపోతున్నాయి. ?తాజా ఆధారాలు: మూలపాడు గ్రామం వద్ద, ధర్మడుగుల రూట్‌లో వాహనాన్ని నిలిపి అక్రమంగా కలప లోడ్ చేస్తున్న దృశ్యాలను ఆధారాలతో సహా పత్రికలకు, సోషల్ మీడియాకు విడుదల చేయడం జరిగింది. ?ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ కలప రవాణాను అరికట్టాలని, లేనిపక్షంలో అక్రమ రవాణాదారులతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై పోలవరం జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేస్తామని సుధీర్ రాజ్ రాపాక హెచ్చరించారు. ?- సుధీర్ రాజ్ రాపాక మాజీ మండల యువజన అధ్యక్షుడు,



## వివాహిత అదృశ్యం పై పిర్యాదు

మధురవాడ/భీమునిపట్నం, ఉష శ్రీ మధురవాడ కొమ్మాది జంక్షన్ శివశక్తినగర్ రోడ్డు శ్రీలక్ష్మీనగర్ లోని తల్లిదండ్రుల ఇంటికి వచ్చిన దొడ్డి సాయి లిఖిత (23) అనే వివాహిత అదృశ్యమయ్యారు. శుక్రవారం (జూలై 24) ఉదయం 8:45 నుంచి 9:15 గంటల మధ్య ఆమె ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బాధితురాలి తండ్రి గొల్లవిల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పి.ఎం.పాలెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.?ఆమె ఆచూకీ తెలిసినవారు పి.ఎం.పాలెం పోలీసులకు (0891-2721333, 9440796060) సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# హైకోర్టు స్టేతో తిరిగి పదవి చేపట్టిన సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మి స్వామి

చేగుంట జులై 25( ఉష శ్రీ రిపోర్టర్) చేగుంట మండలం పోలంపల్లి గ్రామ సర్పంచిగా కొండి రాజలక్ష్మి స్వామి తిరిగి విధుల్లోకి చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ నాపై కొందరు రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా, తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారులను తప్పుదోవ పట్టించారు. ఒక దళిత మహిళా సర్పంచ్ అయిన నన్ను టార్గెట్ చేస్తూ, మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమ సింగ్ 10-07-2026న నన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు ఈ సస్పెన్షన్‌ను కక్షపూరితంగా భావించి, నేను రాష్ట్ర హైకోర్టులో న్యాయ పోరాటానికి పిటిషన్ దాఖలు చేశాను. హైకోర్టు నా వాదనలు విని, కలెక్టర్ కు యదావిధిగా సర్పంచ్ ఉత్తర్వులు మంజూరు చేసింది హైకోర్టు ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య నాపై విధించిన సస్పెన్షన్‌ను తొలగిస్తూ, యథావిధిగా విధులు కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు ఈ న్యాయ పోరాటంలో నాకు ప్రతిక్షణం అండగా నిలిచిన రాష్ట్ర న్యాయ నిపుణులు అడ్వకేట్ నరేష్,అన్నకు ఎప్పటికప్పుడు నాకు తోడుగా నిలచిన గ్రామ పెద్దలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాపై నా గ్రామ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని








వమ్ము చేయను. ప్రజల ఓటుతో ఎన్నికైన గ్రామ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తాను. నా బలం, నా ధైర్యం నా గ్రామ ప్రజలే కొన్ని దుష్ట శక్తులు నేను దళిత మహిళను అని కూడా చూడకుండా, చాలా సందర్భాల్లో అవమానపరుస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తూ తప్పుడు ఫిర్యాదులు చేశారు. న్యాయ పోరాటంలో నేను ఎంతటిదానో వారికి తెలిసొచ్చింది ఇప్పటి నుండి పొలంపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.24 గంటలు ప్రతి సంక్షేమ పథకాన్ని నా గ్రామ ప్రజలకు చేరే వరకు ప్రతి వీధిని, ప్రతి వార్డును తిరుగుతాను. ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాను గ్రామ ప్రజల ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తాను. ఇక నాపై తప్పుడు ఫిర్యాదులతో వస్తే, చట్టపరంగా సరైన గుణపాఠం చెప్తాను అని హెచ్చరిస్తున్నాను. అని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ వెంకటేష్ మాజీ సర్పంచ్ కొండి మల్లేశం పి రాజు, కుమారి యాదగిరి, యాటసత్యం, మారబోయిన ఐలయ్య, యాట ఆంజనేయులు పాల్గొన్నారు

# ప్రతిష్టాత్మకంగా.. విజయవంతంగా గిరి ప్రదక్షిణ

- సమష్టి కృషితో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- భక్తుల రద్దీని తగ్గించేందుకు పలు చోట్ల నమూనా ఆలయాలు
- అధికారులను ఆదేశించిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, జూలై 26, ఉష శ్రీ ప్రతినిధి,: ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, అన్ని కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి మార్గంలో ఏం జరుగుతుందో నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్యను అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు అనువైన ప్రాంతాల్లో నమూనా ఆలయాలను ఏర్పాటు చేసి అక్కడ భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తొలి పావంచాతో పాటు నమూనా ఆలయాల వద్ద కూడా కొబ్బరికాయలు కొట్టి భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




ట్రాఫిక్ నిర్వహణలో ముందుచూపు: కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ : గిరి ప్రదక్షిణ సందర్భంగా సాధారణ ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. నాలుగు ప్రవేశ మార్గాల వద్ద తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేసి, వచ్చే బస్సులు, తిరిగి వెళ్లే బస్సులు ఎక్కడ నిలపాలనే విషయాన్ని సూచించేలా స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. గోపాలపట్నం, చినగదిలి, సీతమ్మధార, పెందుర్తి మండలాల పరిధిలో గిరి ప్రదక్షిణ మార్గానికి సమీపంలోని 221 పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంత, దేవస్థానం ఈవో వెంకటరావు, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తరహాలోనే లోకేష్ రాజీనామా చేయాలి – డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్




ఉష శ్రీ ఆర్ సి ఇంచార్జి కనిగిరి ఆంధ్రప్రదేశ్ లో మెగా డీఎస్సీ నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు రాజీనామా చేయాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో దద్దాల నారాయణ యాదవ్ మీడియా తో మాట్లాడుతూ లోకేష్ పై వస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఇప్పటి వరకూ డీఎస్సీలో అక్రమాలపై సీఎం చంద్రబాబు గారు, నారా లోకేష్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలోని లక్ష మంది నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని, దీనిపై వైఎస్సార్సీపీ మొదటి నుండి పోరాడుతోందని తెలిపారు.డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలను మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధారలతో సహా ప్రజల ముందుంచారని చెప్పారు.నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పులపై విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం తలోగ్గిందని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజా స్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామానే నిదర్శనమన్నారు.ఏపీలో డీఎస్సీ నిర్వహణ,నియామక ప్రక్రియలో వైఎస్సార్సీపీ లేవనెత్తిన అంశాలన్నీ వాస్తవాలేనని దద్దాల నారాయణ యాదవ్ స్పష్టం చేశారు.నిరుద్యోగ యువతకు జరిగిన అన్యాయానికి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి పదవికి ఎప్పుడు రాజీనామా చేస్తారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. చీజుజు పరీక్ష పత్రాల లీకేజీ, రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల్లో అక్రమాల వల్ల అనర్హులు సీట్లు, ఉద్యోగాలు పొంది కొన్ని తరాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు.రాష్ట్రంలో డీఎస్సీ అక్రమాలపై విచారణ జరక్కపోతే హస్తినలో లాగే ఇక్కడ కూడా కాక్రోచ్ లు ఉద్యమిస్తాయని హెచ్చరించారు. వైఎస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు జులై 28 న వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజి,ఫీజు రీయింబర్స్మెంట్ లో వైఫల్యం,నిరుద్యోగ భృతి అమలు చేయకపోవడం వంటి సమస్యలపై జిల్లా ప్రధాన కేంద్రాల్లో వైసీపీ రాష్ట్ర విద్యార్థి,యువజన విభాగాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిరహిస్తున్నట్లు తెలిపారు.. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ మేధావుల ఫోరం కార్యదర్శి ఓకే రెడ్డి, నియోజకవర్గం పార్టీ యువజన విభాగం అధ్యక్షులు వాకమల్ల రాజశేఖర్ రెడ్డి, నాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, పార్టీ యువ నాయకులు టీ. రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# ధర్మేంద్ర రాజీనామాతో.. విశాఖలో విజయోత్సవాలు




**విశాఖపట్నం జూలై 25 ఉష శ్రీ ప్రతినిధి:** నీట్ సహా వివిధ పరీక్ష పేపర్ల లీకేజీల నేపథ్యంలో దేశంలో ఉధృతంగా సాగుతున్న ఆందోళనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య పోరాటాల విజయమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి. రామ్మోహన్ పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్ఓ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రామ్మోహన్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి విద్యే పునాది అని, విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం తగినంత బడ్జెట్ కేటాయించకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. పరీక్షా పేపర్ల లీకేజీలను అరికట్టడంలో వైఫల్యం చెందిందన్నారు ఇప్పటికైనా కఠినమైన చట్టాలు అమలు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య కార్పొరేటీకరణ తగదన్నారు. విద్యారంగాన్ని కాపాడి ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు పి. సాయితేజ, జిల్లా కార్యదర్శి జి. అజయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాల నిరంతర పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎస్ఎఫ్ఐ ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్. రాజు, జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ యువత భవిష్యత్తుతో చెలగాటమాడే పరీక్షల అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. దేశంలో పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్ఓ జిల్లా అధ్యక్షులు విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను వ్యతిరేకిస్తూ విద్యార్థి ఉద్యమాలను మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. విజయోత్సవ ర్యాలీ ప్రారంభంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నృత్యాలు చేశారు. ఉద్యమ గీతాలు ఆలపించారు.

**రిలే నిరాహార దీక్ష :** తొలుత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షను సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహన్, పాలిటెక్నికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ విద్యార్థి, యువజన సంఘాల నాయకులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్న మోడీ సర్కారుకు పతనం తప్పదని అన్నారు. సాయంత్రం ఈ రిలే దీక్షను విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మౌనిక, కుసుమాంజలి, ప్రగతి, నరేష్, తులసి, తరుణ్, సంజయ్, హృదయ, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర మణిహారం.. భోగాపురం విమానాశ్రయం

- ఆగస్టు 1న ప్రారంభోత్సవ వేడుకలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలి
- విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, జూలై 25 ,ఉష శ్రీ ప్రతినిధిః** అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మితమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుందని, ఆగస్టు 1న జరగనున్న ప్రారంభోత్సవ వేడుకను చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగు హాలులో హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమీక్షలో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్న ఆయన అనంతరం కలెక్టరేట్ వీసీ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో భోగాపురం ఎయిర్ పోర్టు కు సంబంధించిన వివరాలను హోం మంత్రి అనితతో కలిసి వెల్లడించారు.

**ఉత్తరాంధ్ర నుంచి భారీగా ప్రజల భాగస్వామ్యం :** భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి సుమారు లక్ష మంది, ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు మూడు లక్షల మంది ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రధానమంత్రి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని, ప్రజల భద్రత, సౌకర్యం, రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. విశాఖపట్నం నగరానికి దూరంగా విమానాశ్రయం నిర్మించారనే అభిప్రాయాలు కొందరు వ్యక్తం చేస్తున్నప్పటికీ, భవిష్యత్ జనాభా పెరుగుదల, ప్రాంతీయ విస్తరణ, అంతర్జాతీయ విమానయాన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక దృష్టితో ఈ ప్రాజెక్టును నిర్మించినట్లు స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భోగాపురం విమానాశ్రయం నిర్మితమైందని పేర్కొన్నారు. ప్రస్తుత అవసరాలను తీర్చడమే కాకుండా భవిష్యత్ తరాల అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని దీన్ని రూపొందించారని, సందర్శించే ప్రతి ఒక్కరికీ దాని విస్తృతి, నాణ్యత, భవిష్యత్ దృష్టి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఉత్తరాంధ్రను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుగా ఈ విమానాశ్రయం నిలుస్తుందని అన్నారు.

**ఉత్తరాంధ్ర సంస్కృతికి అద్దం పట్టే సాంస్కృతిక కార్యక్రమాలు :** ప్రారంభోత్సవ వేడుకల్లో ఉత్తరాంధ్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రసిద్ధ థింసా నృత్యంతో పాటు ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో ఆర్థిక అభివృద్ధి, పెట్టుబడులు, పర్యాటకం, ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కేవలం ఒక మౌలిక వసతుల ప్రాజెక్టు ప్రారంభం మాత్రమే కాదు.. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రస్థానంలో కొత్త అధ్యాయానికి నాంది అని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

**అసిప్ సెమీ కండెక్టర్ టెక్నాలజీ సంస్థకు శంకుస్థాపన :** విశాఖపట్టణం వేదికగా ఏర్పాటు కానున్న ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన అసిప్(ఇూూ×ూ) టెక్నాలజీస్ సెమీ కండక్టర్ సంస్థకు ఆగస్టు 01న ప్రధాని, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుందని పల్లా శ్రీనివాసరావు వివరించారు. ఆ రోజు ఎయిర్ పోర్టుతో పాటు, ఏవియేషన్ హబ్ – యూనివర్శిటీ, ఎడ్యుసిటీలు, జీఎంఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కూడా ప్రారంభమవుతాయని, వాటితో పాటు అసిప్ టెక్నాలజీ సంస్థకు శంకుస్థాపం కూడా జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, సీపీ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభివృద్ధి విశాఖ లక్ష్యం కావాలి

**విశాఖపట్నం,జూలై 25 ,ఉష శ్రీ ప్రతినిధి,:** అన్ని రంగాల అభివృద్ధే విశాఖ లక్ష్యం కావాలనికలెక్టర్ అభిషిక్త్ కిశోర్ పిలుపునిచ్చారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సమావేశాన్ని శనివారం సాయంత్రం పాత జైలు రోడ్డులోని ఓ హోటల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్పో బ్రోచర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ విశాఖ జోన్ ఆధ్వర్యంలో విశాఖ లో మొదటిసారిగా బిజినెస్ ఎక్స్పో చిన్న తరహా మధ్యతరహా పరిశ్రమలు అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖ అంటేనే అనేక అవకాశాలకు ఉపాధికి కేంద్రంగా నిలుస్తుంది అన్నారు. విశాఖపట్నం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సెప్టెంబర్ 11,12,13 తేదీలలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తిలకించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశానికి వస్తున్న పెట్టుబడులలో 25 శాతం పెట్టుబడులు ఏపీ కి వస్తున్నాయని తెలిపారు. వీటిలో అధిక పెట్టుబడులు ఉమ్మడి విశాఖ కు వస్తున్నా అని పేర్కొన్నారు. విశాఖ కు దిగ్గజ సంస్థ గూగుల్ వచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం విశాఖ లో ప్రతి సంవత్సరం భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తుందని చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారుని తెలియజేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ లో 50 వరకు ప్రాజెక్టులు వస్తున్నాయని తెలియజేశారు. విశాఖ లో బే సిటీ కాన్సెప్ట్ తీసుకువస్తున్నారు. ఏపీ చాంబర్స్ కామర్స్ ఆఫ్ ఇండస్ట్రీ విశాఖపట్నం జోన్ చైర్మన్ పి శోభన ప్రకాష్ మాట్లాడుతూ ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11,12,13 తేదీలలో బిజినెస్ ఎక్స్పో నిర్వహిస్తున్నారు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు గుప్తా మాట్లాడుతూ గతంలో విజయవాడలో బిజినెస్ ఎక్స్పో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ చాంబర్స్ కామర్స్ ఇండస్ట్రీస్ వైస్ చైర్మన్ లు పవన్ కార్తీక్, శివకుమార్, ఉమెన్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ శ్రీవల్లి, సభ్యులు గీతా శ్రీకాంత్, వాణి బాల పాల్గొన్నారు.



## లక్ష్మీపురం గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్



**భీమునిపట్నం, ఉష శ్రీ:** రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఒక్కరోజు ఆర్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష ఎకరాలులో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలంలో 42 ఎకరాలులో మొక్కలును రైతులకు ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా శనివారం ఉదయం లక్ష్మీపురం గ్రామ పంచాయతీలోని మొఖర అప్పలనాయుడు సొంత వ్యవసాయ భూమిలో కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమంలో భీమిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి బి జి రామ్ జి పథకం శ్రామికులతో కలిసి భీమిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) టిడిపి క్లస్టర్ కో ఇన్చార్జ్ గాడు తాతి నాయుడు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గాడు తాతినాయుడు మాట్లాడుతూ రైతులకు తమ సొంత పొలాల్లో ఉచితంగా కొబ్బరి మొక్కలును ప్రభుత్వం అందజేస్తుందని వి బి జి రామ్ జి పథకం శ్రామికులు పర్యవేక్షణలో ప్లాంటేషన్ అభివృద్ధి పురుస్తారని కావున రైతులు మీయొక్క పంట పొలాల్లో ఈ ఆర్టికల్చర్ ప్లాంటేషన్ అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల పరిషత్ అభివృద్ధిఅధికారి (ఎంపీడీవో) నరసింహారావు, భీమిలి టిడిపి క్లస్టర్ కో ఇన్చార్జి గాడు తాతినాయుడు టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగమణి, లక్ష్మీపురం గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు కరుబుక్త శ్రీను, తెలుగురైతు కార్యదర్శి కరుబుక్త రామారావు, అంగటి నారాయణరావు శ్రామికులు, రైతులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



**ఆనందపురం/భీమునిపట్నం, ఉష శ్రీ:** అప్పుల బాధతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆనందపురం మండలం సొంత్యాం పంచాయతీ జగనన్న కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ?పోలీసుల కథనం ప్రకారం... జగనన్న కాలనీకి చెందిన కోరుకొండ హేమంత్ కుమార్ (27) గతంలో ట్రావెల్స్ నిర్వహించేవాడు. ప్రస్తుతం ఉపాధి లేకపోవడం, అప్పుల భారం పెరగడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తలుపు తీసిన తల్లి అప్పలకొండ ఉరివేసుకొని ఉన్న కుమారుడిని చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

## గీతం లో "మెషీన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్" పై వర్క్‌షాప్



**భీమునిపట్నం, ఉష శ్రీ:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్ కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ (ఇ.ఇ.సి.ఇ.) విభాగం ఆద్వర్యంలో జూలై 22 నుండి 25 వరకు "మ్యాట్‌ల్యాబ్ తో మెషీన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్" అనే అంశంపై వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆర్కాన్స్ ఇన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో, మ్యాథ్‌వర్క్స్ సీనియర్ ట్రైనింగ్ ఇంజనీర్ డాక్టర్ శుభోబ్రత భట్టాచార్య ప్రధాన రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ప్రత్యేక సెషన్స్ నిర్వహించారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన 30 మందికి పైగా అధ్యాపకులు (ఫ్యాకల్టీ సభ్యులు) ఈ వర్క్‌షాప్‌లో చురుగ్గా పాల్గొన్నారు. వీరు మ్యాట్‌ల్యాబ్ ఉపయోగించి మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ విభాగాలలో ప్రాక్టికల్ (హ్యాండ్స్-ఆన్) అనుభవాన్ని పొందారు. గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ భరణి చంద్ర కుమార్ పక్కి, విభాగాధిపతి డాక్టర్ ఎ. సిహెచ్. సుధీర్, మరియు డాక్టర్ ఎస్. నీరజ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ ఎల్. ఎల్. రాజేశ్వరరావు, డాక్టర్ బి. ఉదయ్ కుమార్ మరియు డాక్టర్ ఎస్. హర్షవర్ధన్ పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామికి లక్ష తులసిదళ అర్చన



**భీమునిపట్నం, ఉష శ్రీ:** స్థానిక కీటీన్ పేట దరి శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భముగా శ్రీ వారికి విశేషముగా లక్ష తులసిదళ అర్చన జరిగినది. ఈ కార్యక్రమం ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్య నారాయణ మూర్తి, కలిగొట్ల భానోజిరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, తాతాజీ ల ఆధ్వర్యంలో జరుగగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది తల్లికి వందనం



**భీమునిపట్నం, ఉష శ్రీ:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం బలమైన పునాదిగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతమైన జీవితానికి విద్యే మూలకారణమని అన్నారు. అందుకు తగ్గట్టుగా విద్యా సంస్కరణలు అనేకం మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. పేద తల్లిదండ్రులు కూడా తన పిల్లలను ఆర్థిక పరమైన కారణాలుతో బడికి దూరంగా ఉంచరాదనే సంకల్పంతో తల్లికివందనం పథకంను కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక ఇంటిలో ఒకరికి మాత్రమే డబ్బులు ఇచ్చేవని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి 13,000 రూపాయలు తల్లి ఖాతాలో జమ అయ్యాయని అన్నారు. దీని ద్వారా పిల్లలను మంచి చదువులు చదివించుకోవాలనే తల్లిదండ్రుల సంకల్పం నెరవేరినట్లేనని అన్నారు. ప్రతీ ఏడాది జూలై నెలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయడం ద్వారా తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల మధ్య ఎటువంటి తారతమ్యాలు లేకుండా చేయడం జరుగుతుందని అన్నారు.

# టి నగరపాలెం పంచాయతీలో లదివీస్ అభివృద్ధి కార్యక్రమాలు



**భీమునిపట్నం, ఉష శ్రీ** మండలం లోని టీ.నగరపాలెం పంచాయతీ గొల్లల పాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను దివిస్ ఆర్థిక సాయంతో చేపట్టి పూర్తిచేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సుమారు 3,50,000 రూపాయల సీ ఎస్ ఆర్ నిధులతో షెడ్డు నిర్మాణం, పెయింటింగ్, ఫ్లోరింగ్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసి గ్రామ పెద్దలకు అందచేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ పనులు పూర్తిచేసి నట్లు దివిస్ ప్రతినిధులు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మాజీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లును పరామర్శించిన నీరు కట్టు, నక్క, పసుపులేటి, పుప్పాల



**ఉష శ్రీ పామూరు ప్రతినిధి** పామూరు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులుపువ్వాడి వెంకటేశ్వర్లు గత నెలలో బైపాస్ సర్జరీ చేయించుకుని కర్నూలు లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించిన 278బూత్ కన్వీనర్ నీరుకట్టు రసూల్, మాజీ వార్డ్ మెంబర్ నక్క తిరుపతయ్య,పామూరు పట్టణ టీడీపీ కార్యదర్శి పసుపులేటి నారాయణ, టీడీపీ నాయకులు నక్క శ్రీనివాసులు, పుప్పాల రామ్మూర్తి తదితరులు పరామర్శించారు.

# కనిగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా... ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి విశేష స్పందన



**ఉష శ్రీ పామూరు ప్రతినిధి** శనివారంకనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు కనిగిరి శాసనసభ్యులు మరియు ఒంగోలు పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షులు డా" ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలోకిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స అందించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి అని ముఖ్య ఉద్దేశంతో మరియుఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది... కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం బలపడుతుందిఅనే భావనతో మహిళల ఆరోగ్యం కోసం ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు..దఈ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు నిపుణులైన వైద్యులు క్యాన్సర్‌కు సంబంధించిన ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలపై సూచనలు అందించారు.




# తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మోరబోయిన నరసింహారావు



**ఉష శ్రీ పామూరు ప్రతినిధి** ఈరోజు తొలి ఏకాదశి సందర్భంగా పామూరు పట్టణంలోనిశ్రీ వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మోపాడు రిజర్వాయర్ వైస్ చైర్మన్ మోర బోయిన నరసింహారావు, కుమార్తె మోరబోయిన హర్షిని యాదవ్ వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

# శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారిని దర్శించుకున్న యారవ, బొల్లా,ఇర్రి, గొళ్ళ, దారపనేని



**ఉష శ్రీ పామూరు ప్రతినిధి** కర్నూలు జిల్లాలోని తుంగభద్ర నదీతీరంలో బృందావనానికి మరియు ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి అత్యంత పేరుగాంచి ఉన్న మంత్రాలయం, శ్రీ గురు రాఘవేంద్ర స్వామి సన్నిదిలో పాల్గొన్నకనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమాశ్రీనివాస్ పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షుడు బొల్లా నరసింహారావు, పామూరు పట్టణ టిడిపి ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, కోడిగుడ్లపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ దారపనేని కొండా బాబు, కంబాల దీన్నే గ్రామ పంచాయతీ టిడిపి నాయకులు గోళ్ల వీరాంజనేయులు,మండల టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడు పోక వినోద్

# ప్రభుత్వ మానసిక వైద్యశాలలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్



**విశాఖపట్నం, జూలై 25 , ఉష శ్రీ ప్రతినిధి:** ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఏఎంఎన్ఎస్ ఇండియా ఆధ్వర్యంలో కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటీ (సీఈఆర్) కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన 50 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించి, దాని పనితీరు, విద్యుత్ ఉత్పత్తి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇటువంటి ప్రాజెక్టుల ఏర్పాటు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. సౌర విద్యుత్ వినియోగంతో ఆసుపత్రి విద్యుత్ వ్యయం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ఉద్ఘాటించారు. కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటీ కింద ఏఎంఎన్ఎస్ ఇండియా విశాఖపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా 2025లో కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో 120 కిలోవాట్లు, విక్టోరియా ఆసుపత్రిలో 80 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేసింది. తాజాగా ప్రభుత్వ మానసిక వైద్యశాలలో 50 కిలోవాట్ల ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. అలాగే రాణీ చంద్రమణిదేవి ప్రభుత్వ ఆసుపత్రిలో 50 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ప్రస్తుతం ఏర్పాటు దశలో ఉంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో విద్యుత్ వ్యయం తగ్గడంతో పాటు పరిశుభ్రమైన, పునరుత్పాదక ఇంధన వినియోగం పెరిగి, పర్యావరణహితమైన, సుస్థిర ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడనుంది. శనివారం జరిగిన కార్యక్రమంలో ఏఎంఎన్ఎస్ విశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రవీంద్రనాథ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి. రామిరెడ్డి, ఏఎంఎన్ఎస్ విశాఖ హెచ్ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ డి.ఎస్. వర్మ, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, అధికారులు, ఏఎంఎన్ఎస్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విశాఖ తీరంలో ‘మద్యం’ బారులు..!





## భగ్గుమంటున్న మహిళా, ధార్మిక సంఘాలు!

**విశాఖపట్నం:** రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అబివృద్ధి చేయాలనే నెపంతో విశాఖపట్నం సముద్ర తీరంలో ‘బీచ్ షాక్స్’ ఏర్పాటు చేసి, బహిరంగంగా మద్యం విక్రయాలు జరిపేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పర్యాటక ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు మద్యం అమ్మకాలకు జీవో నెం. 363 ద్వారా గైడ్‌లైన్స్ విడుదల చేయడంపై మహిళా సంఘాలు, మత్స్యకార సంఘాలు, ప్రతిపక్షాలు మరియు ధార్మిక సంస్థలు మండిపడుతున్నాయి.

**పర్యాటకులకు శాపంగా మారే అవకాశం:** సాధారణంగా విశాఖపట్నం ఆర్.కె. బీచ్, ఇతర తీర ప్రాంతాలకు నిత్యం వేలాది మంది స్థానికులు, పర్యాటకులు తమ కుటుంబాలు, చిన్న పిల్లలతో కలిసి ప్రశాంతంగా గడపడానికి వస్తుంటారు. ఇప్పుడు బీచ్‌లలోనే బహిరంగంగా మద్యం అందుబాటులోకి తెస్తే, తాగుబోతుల వేధింపులు పెరిగి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం విక్రయాలు జరిపితే మహిళలు, విద్యార్థినులు బీచ్ రోడ్డుపై స్వేచ్ఛగా, సురక్షితంగా తిరిగే పరిస్థితి ఉండదని మహిళా సంఘాలు నిరసనలు తెలుపుతున్నాయి.

**సంస్కృతీ, సంప్రదాయాలకు గొడ్డలిపెట్టు:** విశాఖపట్నం కేవలం పర్యాటక కేంద్రమే కాకుండా ఎన్నో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టతలకు నిలయం. బీచ్ పరిసరాల్లో ఆలయాలు, ధార్మిక కేంద్రాలు ఉన్నాయని, ఇటువంటి పవిత్రమైన చోట గోవా సంస్కృతిని తీసుకువచ్చి ‘మద్యం-విందు-చిందు’లను ప్రోత్సహించడం నగర సంస్కృతీ సంప్రదాయాలను మంటగలపడమేనని ధార్మిక సంస్థలు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. కేవలం ఆదాయమే పరమావధిగా ప్రభుత్వం ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని వారు ధ్వజమెత్తారు.

**పర్యావరణానికి తీవ్ర ముప్పు:** గోవా తరహా లిక్కర్ టూరిజాన్ని ఇక్కడ ప్రవేశపెట్టడం వల్ల పర్యావరణానికి సైతం పెద్ద ముప్పు వాటిల్లుతుందని పర్యావరణ విశ్లేషకులు, మత్స్యకార సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు. బీచ్‌లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు పేరుకుపోయి సముద్ర జీవన వైవిధ్యం దెబ్బతింటుందని, మత్స్యకారుల ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వెనక్కి తగ్గకుంటే ఉద్యమం తీవ్రతరం...! :** పర్యాటకం పేరుతో మహిళల భద్రతను, నగర ప్రశాంతతను తాకట్టు పెట్టవద్దని, తక్షణమే ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెనక్కి తీసుకోవాలని విపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. “సేవ్ వైజాగ్” పేరుతో డిజిటల్ క్యాంపెయిన్‌లు, బహిరంగ సభల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చి ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించాయి.





# భూమి నుంచి భవిష్యత్తు వరకు..




**విజయనగరం(ఉషశ్రీ) జూలై 25 :** ఉత్తరాంధ్ర అభివృద్ధికి మణిహారంగా నిలవబోతోన్న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రచార కార్యక్రమం శనివారం విజయనగరంలో ఘనంగా ప్రారంభమైంది. ‘భూమి నుంచి భవిష్యత్తు వరకు’ అనే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. ముందుగా విజయనగరం కోట నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు మంత్రి కొండపల్లి ఆధ్వర్యంలో భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. వేలాది వాహనాలతో కూడిన ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. ర్యాలీ బాలాజీ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, సంతకాల వంతెన, వీటి అగ్రహారం, రాజాపులోవ మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు వరకు జరిగింది. కోట జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ప్లేడ్జ్ వాల్ పై ప్రముఖులంతా భోగాపురం ఎయిర్పోర్ట్ పై తమ అభిప్రాయాలను రాసి సంతకాలు చేశారు. మంత్రి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఇతర ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని సంతకాలు చేశారు. అనంతరం కోటవద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద యువతీయువకులు పెద్ద ఎత్తున సెల్ఫీలు దిగారు. ముఖ్యంగా మంత్రి కొండపల్లి, జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ సంయుక్తంగా సెల్ఫీ దిగడం పలువురిని ఆకట్టుకుంది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి మరో వారం రోజులు గడువు ఉంది. ఎప్పుడు ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ చారిత్రక ఘట్టాన్ని అనుక్షణం గుర్తు చేయడానికి ఏర్పాటు చేసిన కౌంట్ డౌన్ డిజిటల్ టైమర్ ను మంత్రి కొండపల్లి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి కొండపల్లి మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర ప్రాంతానికి నిజమైన ‘గ్రోత్ ఇంజిన్’ లా పనిచేస్తుందని.. ఈ ప్రాంతంలో భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా స్థానిక యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, జేసి సేధు మాధవన్, ఎమ్మెల్యేలు.కిమిడి కళా వెంకటరావు, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారి, లోకం నాగ మాధవి, మార్కెఫెడ్ చైర్మెన్ కర్రోతు బంగార్రాజు, డిసిసిబి చైర్మెన్ కిమిడి నాగార్జున తదితర ప్రముఖులు, కూటమి పార్టీల నాయకులు, అధికారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొనడంతో పండగ వాతావరణం నెలకొంది.

## చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహమే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, (ఉషశ్రీ), జులై 25:** అన్ని రంగాల అభివృద్ధితో విశాఖను మరింత ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అన్నారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఏపీ చాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విశాఖలో తొలిసారిగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా బిజినెస్ ఎక్స్‌పో నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖ ఉపాధి, పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, నగర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 11, 12, 13 తేదీల్లో నిర్వహించే బిజినెస్ ఎక్స్‌పోను పరిశ్రమలు, వ్యాపారవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు వస్తోందని, అందులో అధిక పెట్టుబడులు ఉమ్మడి విశాఖ జిల్లాకు లభిస్తున్నాయని తెలిపారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు విశాఖకు రావడం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది భాగస్వామ్య సదస్సు నిర్వహించడం ఇందుకు నిదర్శనమన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, ఈ ప్రాంతంలో సుమారు 50 ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. అలాగే విశాఖలో బే సిటీ కాన్సెప్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ విశాఖ జోన్ చైర్మన్ పి. శోభన ప్రకాష్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు బిజినెస్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ చాంబర్స్ ప్రతినిధులు, మహిళా విభాగం సభ్యులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అల్లూరి పేరుతో విమానాశ్రయానికి గొప్ప హోదా



విజయనగరం(ఉషశ్రీ) జూలై 25 : భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరలను ఎదిరించిన విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు పేరు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు పెట్టడంతో ఆయన త్యాగం దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆగస్టు నెల 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో శనివారం జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించిన మంత్రి అనంతరం అక్కడ విలేకర్ల సమావేశంలో ఎయిర్‌పోర్ట్ గురించి పలు విషయాలు వెల్లడించారు. ఉత్తరాంధ్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన భోగాపురం అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పాల్గొంటున్నట్టు మంత్రి తెలిపారు. అరకు ప్రాంతానికి చెందిన సుమారు 13,000 మంది బాలికలతో ప్రత్యేక దింసా నృత్య ప్రదర్శనతో ప్రధానమంత్రికి స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ బహిరంగ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి 5 వేల బస్సులతో భారీ ఎత్తున జనసమీకరణ చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఇక విశాఖపట్నం నుంచి విమానాశ్రయానికి ప్రతిపాదించిన 7 కనెక్టివిటీ రహదారులలో ఇప్పటికే నాలుగు పూర్తయ్యాయని.. మిగిలిన మూడు రహదారుల పనులు శరవేగంగా జరుగుతున్నట్టు తెలిపారు. అలాగే కోస్టల్ కారిడార్‌గా ఆరు లైన్ల బీచ్ రహదారిని 8000 కోట్ల రూపాయలతో అనుసంధానించే మాస్టర్ ప్లాన్ కూడా రెడీ అవుతోందన్నారు. విశాఖ నగరం నుంచి విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల కోసం జీఎంఆర్ సంస్థకు 69 మెట్రో బస్సులను కూడా కేటాయించినట్టు మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు. గతంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంపై ఎద్దేవా చేస్తూ ఎర్రబస్సు వెళ్లని చోట ఎయిర్‌పోర్ట్ ఎందుకని వైసీపీ నేతలు వెటకారం చేశారని.. ఇప్పుడు చంద్రబాబు ఎంతో కష్టపడి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలా చేయడంతో వైసీపీ వాళ్ల వద్ద సమాధానం లేకుండా పోయిందని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చూసి వైసీపీ నేతలు కళ్లు తెరవాలన్నారు. ఈ విమానాశ్రయ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు, స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఇప్పటికే జాబ్ మేళాలు నిర్వహించి బ్లూ కాలర్, వైట్ కాలర్ ఉద్యోగాలు కూడా వారికి ఇచ్చామన్నారు. ఉత్తరాంధ్ర మామిడి, మత్స్య ఉత్పత్తులు ప్రపంచస్థాయికి ఎగుమతి అయ్యేలా కార్గో సదుపాయం కూడా త్వరలోనే రాబోతోందని తెలిపారు. దీనివల్ల అనేక పరిశ్రమలు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్ర నుంచి వలసలు తగ్గుతాయన్న ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయంలో పూర్తి సేవలు ఆగస్టు 17 నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో భోగాపురం ఎయిర్‌పోర్ట్ తర్వాత విజయనగరం జిల్లా కూడా అలాగే అభివృద్ధి చెందుతుందని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి భూములు ఇచ్చిన రైతులతో పాటు ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసిన జీఎంఆర్ యాజమాన్యానికి, ప్రతి నెలా సమీక్షలు చేసి పనులు వేగంగా పూర్తయ్యేలా చేసిన కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు, మోడీకి, చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే 2015లో నాడు కేంద్ర విమానయాన శాఖా మంత్రిగా ఉన్న పూసపాటి అశోక్‌గజపతిరాజు ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని.. ఇప్పుడు ఇది పూర్తి కావడంతో ఆయన కల నెరవేరిందని మంత్రి తెలిపారు. అంతకు ముందు జిల్లా జిల్లా కలెక్టర్ రాం సుందర్ రెడ్డి మాట్లాడుతూ 2017లో నాడు ముఖ్యమంత్రి హోదాలోనే చంద్రబాబు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే 2026 ఆగస్టు 1న మళ్లీ చంద్రబాబు సీఎంగా ఉండగానే ప్రారంభోత్సవం జరుపుకోవడం అభినందనీయమన్నారు. 4592 వేల కోట్లతో నిర్మితమైన ఈ ఎయిర్‌పోర్ట్ ప్రస్తుతం యేడాదికి 60 లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే సామర్థ్యంతో పనిచేస్తుందని.. భవిష్యత్తులో యేడాదికి 4 కోట్ల మంది ప్రయాణికులకు కూడా సేవలు అందించేలా తీర్చిదిద్దినట్టు తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్‌కు 3800 మీటర్ల పొడవైన రన్‌వే ఉండడంతో ఎలాంటి పెద్ద విమానం అయినా సులువుగానే ల్యాండ్ అవుతుందని కలెక్టర్ తెలిపారు. అత్యాధునికమైన ప్యాసింజర్ టెర్మినల్‌తో పాటు త్వరలోనే కార్గో టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. క్వాలిఫైడ్ సిబ్బందితో విమానయాన సేవలు అందించాలన్న ఉద్దేశంతో పక్కనే జీఎంఆర్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా అందుబాటులోకి వస్తోందని.. ఏపీలోనే మొదటిసారిగా ఫ్లైట్ మెయింటెనెన్స్ ఫెసిలిటీ కూడా ఇక్కడ ఏర్పాటు అవుతోందన్నారు. ఈ విమానాశ్రయం ఏర్పాటుతో ప్రత్యక్షంగా 15 వేల మందికి, పరోక్షంగా 5.85 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతం అంతా భవిష్యత్తులో హోటళ్లు, రెస్టారెంట్లు, కమ్యూనికేషన్, ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాలకు ఒక ప్రధాన కేంద్రంగా (హబ్) మారబోతోందని కూడా కలెక్టర్ పేర్కొన్నారు. 2002-03లో సమైక్యాంధ్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు మలేషియా వెళ్లి అక్కడ ఎయిర్‌పోర్ట్ చూసిన వెంటనే భోగాపురంలోనూ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలనుకున్నారని.. ఇన్నేళ్లకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ పూర్తి కావడంతో ఉత్తరాంధ్ర వాసులకు ఆ గొప్ప అదృష్టం దక్కిందన్నారు. ఇప్పటికే ఉత్తరాంధ్రకు రైల్వేజోన్ ఏర్పాటు కావడం, ఉద్యోగ కల్పనలో దేశంలోనే వైజాగ్‌కు 5వ స్థానం దక్కడం.. మోడీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో ఈ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెట్టడం చూస్తుంటే భవిష్యత్తులో ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టనుందని జోస్యం చెప్పారు. ప్రపంచంలో ఎన్నో ఎయిర్‌పోర్ట్‌లు ఉన్న జీఎంఆర్ తన సొంత ప్రాంతమైన రాజాం, విజయనగరం జిల్లాకు గొప్ప ఎయిర్‌పోర్ట్ ఉండాలన్న సంకల్పంతోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేశారని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వాల్లోని నేతలు, భూములు ఇచ్చిన రైతులు, జీఎంఆర్‌కు ఎంపీ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఇంత గొప్ప అంతర్జాతీయ విమానాశ్రయం రావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని ఎమ్మెల్యే లోకం మాదవి అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసిన ఈ ప్రాజెక్టు మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం కావడం గర్వకారణమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులను గత ప్రభుత్వం నిర్వీర్యం చేయగా.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ విమానాశ్రయాన్ని ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా తీసుకుని పూర్తి చేసిందన్నారు. అలాగే రుషికొండ నుండి భోగాపురం వరకు ఒక మంచి కారిడార్‌గా ఐటీ, పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని తాను విశ్వసిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున, ఎస్పీ దామోదర్ నాయుడు, కూటమి ప్రభుత్వ నేతలు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ లో సర్వేయర్ల దే హవ....!


- భూ సర్వే కావాలంటే ఆమ్యమ్యాలు సమర్పించాల్సిందే..
- అడిగిన సొమ్ము ఇచ్చినప్పటికీ సర్వేలో జాప్యం..?
- ఉన్నతాధికారుల అలసత్వంతో రెచ్చిపోతున్న వైనం




విశాఖపట్నం : జీవీఎంసీ పరిధిలోని పలు జోన్లలో సర్వేయర్ల దే హవగా మారిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. స్థలాలు సర్వేకు సంబంధించి అధికారికంగా చలాన కట్టినప్పటికీ, ఆమ్యామ్యాలు సమర్పించనిదే ఫైలు ముందుకు కదలని పరిస్థితి. తెర సొమ్ము చెల్లించిన తర్వాత కూడా, సకాలంలో పనులు జరగక, ఇదిగో.. అదిగో అంటూ తిప్పిస్తున్నారని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి అనుబంధంగా 8 జోన్లు ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం వికేంద్రీకరణ జరిగినప్పటికీ, ప్రజలకు అందించాల్సిన సేవలు విషయంలో జాప్యం జరుగుతూనే ఉండడం తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తుంది. ముఖ్యంగా భూములకు సంబంధించి పలు ప్రాంతాల్లో చాలా వివాదాలు ఉన్నాయి. దీనికి సంబంధించి జీవీఎంసీ అధికారుల నుంచి సర్వే జరిపి, అధికారికంగా తమ భూమి అనిపించుకునేందుకు, సర్వే కోసం మీ సేవలో చలాన కట్టి, దరఖాస్తు చేస్తుంటారు. ఆయా జోన్ కు సంబంధించిన సర్వేర్లకి ఆ దరఖాస్తు పంపిస్తూ సర్వే చేయాలని, ఎస్టేట్ ఆఫీసర్ ఆదేశిస్తారు. అయితే సకాలంలో ఆ దరఖాస్తు ఆయా జోన్లకు సంబంధించిన సర్వేలకు చేరినప్పటికీ, సర్వే ఆలస్యం చేస్తూ, బాధితులను పదిసార్లు తిప్పించడం జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సర్వేయర్ కి కొంత డబ్బులు ముట్ట చెబితే పనులు వెంటనే జరుగుతాయని, ఆ శాఖలోనే దిగువ స్థాయి సిబ్బంది చేత చెప్పించే ఘనులు కూడా ఉన్నారని తెలుస్తోంది. సంబంధిత సర్వేర్ కి సొమ్ములు ముట్టజెప్పినప్పటికీ, నెలల తరబడి తిప్పిస్తూ, బాధితుల సహనం పరీక్షిస్తున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. వాళ్లతో గొడవ పెట్టుకోలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయలేక, సతమతమవుతూ తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భూమి ధరలు పెరగడంతో :** జీవీఎంసీ పరిధిలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో, భూ ఆక్రమణలు కూడా ఎక్కువయ్యాయి. తమ భూమి కాపాడుకునే క్రమంలో, ప్రభుత్వ సర్వేయర్ నుంచి సర్వే రిపోర్ట్ తీసుకొని న్యాయపరంగా పోరాటం చేయడానికి, సర్వేయర్లను ఆశ్రయిస్తుంటారు. ఇదే సర్వేయర్ల పాలిట వరంగా మారుతుంది. అవినీతి ద్వారాలను తెరిచేలా చేస్తుంది. ప్రజల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న సర్వేయర్లు, ఇష్టానుసారం దోచుకుంటున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. సర్వేర్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే, ఈ పరిస్థితి నెలకొంటుందని, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సర్వే డిపార్ట్మెంట్ను ప్రక్షాళన చేసి, ప్రజలకు తృతీయతను సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# జన విజ్ఞాన వేదిక తరగతులకు అనుమతి...!



పార్వతీపురం(ఉషశ్రీ) జూలై 25: జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక తరగతులు బోధించేందుకు అనుమతి ఇవ్వాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వంగల దాలినాయుడు, కార్యదర్శి దానాల చంద్రమౌళి, ట్రెజరర్ కొండగొర్రి చిన్నారావు, మంత్రపూడి వెంకటరమణ తదితరులు కోరారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం సూపరింటెండెంట్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి, జన విజ్ఞాన వేదిక జాతీయ సలహాదారు ఎం.వి.ఆర్.కృష్ణాజీ తదితరులు జిల్లాలోని ప్రతి పాఠశాల విద్యార్థుల్లో విజ్ఞాన చైతన్యం నింపేందుకు తరగతులు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. జిల్లాలో మారుమూల, గిరిజన గ్రామాలు అధికంగా ఉన్నాయని, ఇప్పటికీ పలు గ్రామాలలలో మూఢ నమ్మకాలు, మూఢాచారాలు రాజ్యమేలుతున్నాయన్నారు. వచ్చే తరంలో మూఢనమ్మకాలు, మూఢాచారాలు లేకుండా చేసేందుకు విద్యార్థుల్లో సైన్స్ చైతన్యం నింపేందుకు జెవివి సంకల్పించిందన్నారు. నేటి జన్ జీ తరానికి మనో వైజ్ఞానిక శాస్త్రం, మానసిక పరిపాక్వత పెంపొందించడం ఎంతో అవసరం అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు మనోస్థైర్యం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు జన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. నేటి విద్యార్థులకు వాస్తవం, అవాస్తవం, మెదడు, మనసు, ఏకాగ్రత, జ్ఞానాన్ని సమర్పించడం, శాస్త్రీయం శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ దృష్టి, శాస్త్రీయ పద్ధతి, నమ్మకం, మూఢ నమ్మకం, సమాజం, సమాజంలోని మంచి, చెడు, నిజం, అబద్ధం, విజ్ఞాన శాస్త్ర ప్రయోజనం, సూడో సైన్స్, మంత్రాలు మ్యాజిక్కులు, హక్కు, విధి, బాధ్యత, కర్తవ్యం, భారత రాజ్యాంగం, మన చట్టాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, మహిళా చట్టాలు తదితరు వాటిపై జన విజ్ఞాన వేదిక అవగాహన కల్పిస్తుందన్నారు.

# డీఎస్సీ స్కామ్ పై సీబీఐ విచారణ చేయాలి



విశాఖపట్నం, జూలై 25, ఉష శ్రీ ప్రతినిధి విద్యార్థుల భవిష్యత్తు కోసం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి మరియు యువజన విభాగాల ఆధ్వర్యంలో జూలై-28 తేదీ (మంగళవారం) జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుండి ఎల్.ఐ.సి బిల్డింగ్ డా" బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం వరకు జరగనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఈ రోజు విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన మరియు విద్యార్థి విభాగం రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ నాయకులుతో సమావేశం నిర్వహించిన విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు అనంతరం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు మొల్లి అప్పారావు,జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉరుకూటి రామ చంద్రరావు (చందు) మరియు జోనల్ విభాగం అధ్యక్షులు అంబటి నాగ వినాయక శైలేష్ , రాష్ట్ర యువజన, విద్యార్థి నాయకులు బాణాల తరుణ్ కుమార్, దొడ్డి కిరణ్, సూరాడ అనుదీప్, జీరు రాపు రాపు రెడ్డి, గుంటు ఆనంద్, జగ శ్రవణ్ కుమార్, పాల రమణ, కాగితాల రవికిరణ్, తాడి రవితేజ, మువ్వల సంతోష్ కుమార్ రెడ్డి, వాక తులసి కృష్ణ కుమార్; రాష్ట్ర యువజన, విద్యార్థి నాయకులు మీసాల వి.డి.ఎస్. ప్రదీప్, యలమంచిలి సంతోష్ కుమార్, సంతోష్ కుమార్, వెంకట సతీష్ కుమార్, మద్ది కామేష్ రెడ్డి, ఖండవలి రోహిత్, గుజ్జరి మురళి, సోడి విమల కుమార్, బి.సి. రెడ్డి, అబ్దుల్ కరీం ఖాన్, పల్లా రామకృష్ణ చైతన్య, మరియు మహ్మద్ సర్ఫరాజ్ ఆలం తదితరాలు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి - ప్రాణాలు కాపాడుకోండి



విశాఖపట్నం, జూలై 25, ఉష శ్రీ ప్రతినిధి ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్ రావు , టెన్ స్కూల్ విద్యార్థులులి కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతపై అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మరియు ట్రాఫిక్ పోలీసులు కలిసి "హెల్మెట్ ధరించండి – ప్రాణాలు కాపాడుకోండి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ద్విచక్ర వాహనదారులకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సుదర్శన్ రావు కోరారు. విద్యార్థులు చేసిన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

# విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది తల్లికి వందనం



ఉష శ్రీ అచ్యుతాపురం ప్రతినిది : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం బలమైన పునాదిగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దర్మిరెడ్డి నాయుడు బాబు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, విద్యార్థుల ఉన్నతమైన జీవితానికి విద్యే మూలకారణమని అన్నారు. అందుకు తగ్గట్టుగా విద్యా సంస్కరణలు అనేకం మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. పేద తల్లిదండ్రులు కూడా తన పిల్లలను ఆర్థిక పరమైన కారణాలుతో బడికి దూరంగా ఉంచరాదనే సంకల్పంతో తల్లికివందనం పథకంను కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. గత ప్రభుత్వం ఒక ఇంటిలో ఒకరికి మాత్రమే డబ్బులు ఇచ్చేవని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి 13,000 రూపాయలు తల్లి ఖాతాలో జమ అయ్యాయని అన్నారు. దీని ద్వారా పిల్లలను మంచి చదువులు చదివించుకోవాలనే తల్లిదండ్రుల సంకల్పం నెరవేరినట్లేనని అన్నారు. ప్రతీ ఏడాది జూలై నెలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్ ఏర్పాటు చేయడం ద్వారా తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల మధ్య ఎటువంటి తారతమ్యాలు లేకుండా చేయడం జరుగుతుందని అన్నారు.

# ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న అంచూరి వెంకటరెడ్డి



ఉష శ్రీ పామూరు ప్రతినిధి పామూరు గ్రామ పంచాయతీ (గోపాల పురం గ్రామంలో)స్థానిక 1వ సచివాలయం పరిధిలో ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు, నియోజకవర్గ శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో "ప్రభుత్వ గ్రామ ఆరోగ్య కేంద్రం" భవనం నిర్మాణానికి 42 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈరోజు బోరు, మరియు భూమి పూజ కార్యక్రమాన్ని స్థానిక టిడిపి నాయకులు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు అంచురి వెంకటరెడ్డి (స్థలదాత) పామూరు సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, రాష్ట్ర బిజెపి నాయకులు కొండిశెట్టి రమణయ్య, పామూరు నీటి సంఘం చైర్మన్ పాలపర్తి రమణయ్య,273 బూత్ కమిటి ఇంచార్జీ పాలపర్తి రాంబాబు తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోప్రభుత్వ అధికారులు పంచాయతీ కార్యదర్శి జి అరవింద రెడ్డి , ప్రభుత్వ వైద్య అధికారులు యస్. కె దాదా పీర్, ఆరోగ్య సిబ్బంది యన్.బ్రహ్మానందం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తేజ, కాంట్రాక్టర్ హరినాథ్, టిడిపి నాయకులు, శ్రేణులు, స్థానిక ప్రజలు తదితరులు హాజరయ్యారు.

# ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించం

- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పాత్రపై లోతైన దర్యాప్తు
- 'ఆపరేషన్ అరణ్య'పై నిరంతర సమీక్ష: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి, (ఉషశ్రీ), జులై 25:** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరించే వారెవరైనా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు చేపడతామని, 'ఆపరేషన్ అరణ్య' అమలును ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని స్పష్టం చేశారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలం వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద రూ. 1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై శనివారం ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు స్వాధీనం :** స్టేట్ ఇంటెలిజెన్స్ అందించిన కచ్చితమైన సమాచారంతో చేపట్టిన వాహన తనిఖీల్లో ఇంటి సామగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ వాహనంలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న హర్యానాకు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వివరించారు. వారి వద్ద నుంచి రూ. 1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించి అతడిని కూడా అరెస్టు చేసినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో ఈ ముఠాకు సహకరిస్తున్న మరికొందరు ప్రధాన సూత్రధారులను కూడా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని, ఈ తరహా నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# మొద్దు నిద్రలో పంచాయతీ, మార్కెటింగ్ శాఖ అధికారులు

- ప్రజల, రైతుల ప్రాణాలతో చెలగాటం
- నిధులు లేనప్పుడు తవ్వకాలు ఎందుకు అంటున్న గ్రామస్తులు





**కైకలూరు ఉషశ్రీ జులై 25:** ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి ప్రధాన రహదారి పూర్తిగా జలమయం కావడంతో పంచాయితీ మార్కెటింగ్ శాఖ అధికారులు కైకలూరు రైతు బజార్ ఎదురుగా ఉన్న డ్రైనేజీని జెసిబి సహాయంతో తవ్వించి అడ్డుగా ఉన్న తూములను తొలగించారు. ఇంతవరకు కథ బాగానే ఉన్నా ఇక్కడే అసలు సమస్య మొదలయ్యింది తవటమైతే తవ్వారు కానీ దానిని పూడ్చే విషయంలో అటు పంచాయతీ ఇటు మార్కెటింగ్ శాఖ అధికారుల సమన్వయ లోపం సామాన్య ప్రజల రైతుల పాలిట శాపంగా మారింది నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చి వినియోగదారులు కూరగాయలు నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకుంటారు రైతులు కూడా వారు పండించిన కూరగాయలు ఆకుకూరలు రైతు బజారుకు తీసుకొని వచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు రైతులు వినియోగదారులు రైతుబజారుకు వచ్చే రహదారి పూర్తిగా తవటంతో నడవడానికి కూరగాయలు దిగుమతులు ఎగుమతులు చేసుకోవటానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గతంలో డ్రైనేజీ నీరు సరిగా వెళ్లకపోతే పంచాయతీ అధికారులు శుభ్రం చేసే వారిని అసలు ఓ పక్క సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడుతుంటే కొద్దిపాటి వర్షానికి డ్రైనేజీ తవ్వి రహదారి సౌకర్యం లేక అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సమస్యను ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న స్పందించిన వారే కరువయ్యారని రైతులు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు పంచాయతీ అధికారుల వద్దకు వెళితే మా దగ్గర నిధులు లేవని మార్కెటింగ్ శాఖ అధికారులు మరమ్మత్తులు చేయించుకోవాలని అంటున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులు మాత్రం డ్రైనేజీ బాధ్యత పూర్తిగా పంచాయతీ వారిదేనని తవ్వించింది కూడా వారే కదా అని మాట దాటవేస్తున్నారని ఇక మేము ఎవరి వద్దకు వెళ్లి పని చేయించుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నామని రైతులు తెలియజేస్తున్నారు. అసలు రైతు బజార్ వద్ద తవ్వకాలు జరిగే ముందే తూములు కూడా ఏర్పాటు చేసుకొని తవ్వకాలు చేయాలని అనాలోచిత చర్యలు ముందుచూపు లేకపోవడం వల్ల అధికారులు సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు అన్నారు సామాన్య మధ్యతరగతి ప్రజల రైతుల ప్రాణాలు పోతే గాని ప్రమాదాలకు గురైతే గాని అధికారులు స్పందించరా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

**పెన్మత్స త్రినాధ రాజు, ఏ ఏం సి చైర్మన్:** పంచాయతీ అధికారులు డ్రైనేజీ మరమ్మత్తుల సమయంలో తెలిస్తే వెళ్లాను తప్ప తనకేమీ తెలవదని మార్కెటింగ్ శాఖలో ఎటువంటి నిధులు లేవని డ్రైనేజీ విషయం పంచాయతీ అధికారులే చూసుకోవాలని తాను కూడా రైతులు ప్రజలు పడుతున్న ఇబ్బందులు పంచాయతీ అధికారం దృష్టికి తీసుకొని వెళ్లానని మరోసారి తూములతో డ్రైనేజీ పూడ్చే విధంగా తగు చర్యలు తీసుకుంటానని తెలియజేశారు

# ఆగస్టు 1న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం




**అమరావతి, (ఉషశ్రీ), జులై 25:** విజయనగరం జిల్లా భోగాపురంలో నూతనంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి ప్రారంభించనున్నట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ తెలిపారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" పేరుతో జులై 25 నుంచి ఆగస్టు 1 వరకు ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో సమాచార, పౌర సంబంధాల శాఖతో పాటు జిల్లా యంత్రాంగాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయాన్ని ప్రజలతో పంచుకునేందుకు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో కౌంట్‌డౌన్ డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**ప్రారంభోత్సవంలో పూజలు యోగాసనాలు :** విద్యార్థుల కోసం "మై డిస్ట్రిక్ట్ టేక్స్ ఆఫ్" అంశంపై క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు ఆగస్టు 1న జరిగే ప్రారంభోత్సవ సభలో ప్రత్యేక ఆసనాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే ఉత్తరాంధ్రలోని ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతాల అభివృద్ధిలో విమానాశ్రయం పాత్రను వివరిస్తూ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో అరకు కాఫీ, అరకు పసుపు వంటి స్థానిక ఉత్పత్తుల ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పర్యాటక అవకాశాలపై అవగాహన సదస్సులు, హోమ్‌స్టేల నమోదుపై ప్రచారం నిర్వహించనున్నట్లు చెప్పారు.

**పలు సాంస్కృతిక కార్యక్రమాలు :** జులై 30న మహిళలతో భారీ ముగ్గుల పోటీలు, జులై 31న విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో 5కే, 10కే మారథాన్, సైక్లథాన్, ఫ్లాష్‌మాబ్‌లు, భారీ డ్రోన్ షో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే భోగాపురం థీమ్‌తో క్రీడా పోటీలు, పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజుకు నివాళిగా జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జులై 31న ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు పేర్కొన్న కె.ఎస్. విశ్వనాథన్, ఈ చారిత్రాత్మక వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## జులై 28న.. వైసీపీ విద్యార్థి, యువజన విభాగాలు భారీ నిరసన ర్యాలీ



**విశాఖపట్నం:** విద్యార్థులు, యువత భవిష్యత్తు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో జూలై 28న విశాఖపట్నంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.కే. రాజు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర, నియోజకవర్గ స్థాయి యువజన, విద్యార్థి విభాగాల నాయకుల సమావేశంలో ఈ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలపై సమగ్ర సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ఆందోళన బాట పట్టిన విద్యార్థులకు పూర్తి స్థాయి సంఘీభావం తెలుపుతున్నట్లు వివరించారు. బకాయి పడిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ లతో భారీ ర్యాలీకీ సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు అర్హులైన నిరుద్యోగులందరికీ తక్షణమే నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నుండి ప్రారంభమై ఎల్.ఐ.సి బిల్డింగ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరగనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ, విద్యార్థుల, యువత హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి రామచంద్రరావు (చందు), జోనల్ అధ్యక్షుడు అంబటి నాగ వినాయక శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కులాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**విశాఖపట్నం:** గీత కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీతమ్మధారలోని శెట్టిబలిజ భవనంలో ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గీత కులాల సమస్యలు, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై కీలక సూచనలు చేశారు. చెట్టుపై నుంచి పడి ప్రమాదవశాత్తు మరణించే గీత కార్మికులకు, గతంలో మాదిరిగానే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చే విషయమై ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెనుకబడిన గీత కులాల విద్యార్థులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు త్వరలోనే విశాఖపట్నంలో భారీ మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. గీత కులాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి అవకాశం ఉన్నవాళ్లు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గీత కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు సంపంగి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అప్పారి గిరి నిర్వహణలో జరిగిన ఈ సమావేశంలో యాత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిల్లి సుజాత నూకరాజు, కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లి సింహాచలం, పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ గుడి చైర్మన్ కడవల రఘు, నాయకులు రేఖల కృష్ణ గౌడ్, గొడ్డి కన్నారావు, రెడ్డి వెంకటేశ్వరరావుతో పాటు పెద్ద సంఖ్యలో గీత కులాల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో పెండింగ్‌లో ఉన్న బీమా ప్రీమియంపై కేంద్రం గ్రీన్ సిగ్నల్



**అమరావతి, (ఉషశ్రీ), జులై 25:** వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 1,900 కోట్ల పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వానికి హామీ ఇవ్వడంతో ఖరీఫ్-2024 పంటల బీమా బకాయిల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వివరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పంటల బీమా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించినట్లు మంత్రి తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్-2024 పంటల బీమా నిధుల విడుదలకు అంగీకరించిందన్నారు. కేంద్రం నుంచి నిధులు విడుదలైన వెంటనే అర్హత కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బీమా మొత్తాన్ని నేరుగా జమ చేయనున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన సమస్యలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోందని, రైతులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పంటల బీమా నిధుల విడుదలకు సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం



**విజయనగరం(ఉషశ్రీ) జూలై 25:** రోటరీ క్లబ్ ప్రాజెక్ట్ లో భాగంగా రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుస్తున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ 4వ వార్షికోత్సవం కొత్తగ్రహారం రోటరీ కమ్యూనిటీ హాల్ లో శనివారం సాయంత్రం ఉత్సాహభరితంగా జరిగింది. ఉసిరికల చంద్రశేఖర రావు జ్యోతిప్రజ్వలన చేయగా డాక్టర్ డి.వి. శ్రీకాంత్, సూర్యలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి త్యాగరాజ స్వామి, పేర్రాజు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి సమర్పించారు. అనంతరం గాత్రం, వీణ, మృదంగ, కీబోర్డ్, గిటార్ విద్యార్థుల ప్రదర్శనలు ప్రతిభావంతంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ దుర్గా బాలాజీ, అతిథులుగా రోటరీ ప్రెసిడెంట్ నిర్మల్ జైన్, డాక్టర్ శ్రీకాంత్ విచ్చేసి విద్యార్థులను అభినందించి 4వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి తన ప్రసంగంలో కేవలం ఒకే వేదికగా ప్రారంభమైన అకాడమీ నాలుగు సంవత్సరాలలో విజయనగరంలో మూడు శాఖలుగా విస్తరించిందని చెప్పారు. ముఖ్య అతిథి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు డాక్టర్ కె. ఎ.పద్మప్రియ, శారద, మంగతాయారు, వెంకట కామేశ్వర రావు, మహేశ్వర రావు, భానుహర్ష, బాలాజీస్వామి, సతీష్, నాగేంద్రప్రసాద్, పేరి కామేష్ కుమార్ తదితరులను అభినందించారు నగరంలో ప్రముఖులు డాక్టర్ ఏ.గోపాలరావు, సుధాకర్, రాధికారాణి, మురళీకృష్ణ, చీలా రవిశంకర్ , సూర్యలక్ష్మి, భరద్వాజుల చక్రవర్తి, తల్లితండ్రులు, సంగీతాభిమానులు విశేషంగా పాల్గొన్నారు.



# వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల సాయంతో సీడ్ బాల్స్ వెదజల్లింపు



**అమరావతి, (ఉషశ్రీ), జులై 25:** రాష్ట్రంలో క్షీణించిన అడవుల పునరుద్ధరణ కోసం సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. వర్షపాతం, నేలలో తేమ పరిస్థితులను పరిశీలిస్తూ అవసరమైతే మరిన్ని డ్రోన్లను వినియోగించి సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని విస్తరించాలని సూచించారు. అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లాల వారీగా సీడ్ బాల్స్ పంపిణీ, డ్రోన్ సాంకేతికత వినియోగం, తదుపరి కార్యాచరణపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, వాటిలో 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్‌ను సుమారు 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లినట్లు అధికారులు వివరించారు. మానవ వనరుల సాయంతో సుమారు 6 వేల హెక్టార్లలో 59 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లగా, తొలిసారిగా డ్రోన్ల ద్వారా మనుషులు చేరుకోలేని లోయలు, అటవీ ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో సీడ్ బాల్స్ జారవిడిచినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం సర్కిల్‌లో అత్యధికంగా 28 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లగా, అందులో 2.26 లక్షలు డ్రోన్ల ద్వారా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. విశాఖ అటవీ డివిజన్‌లో 7.50 లక్షలు, కర్నూలు అటవీ ప్రాంతంలో 8.67 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లినట్లు అధికారులు తెలిపారు. చింతూరు, పీటీ ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం, వైఎస్సార్ కడప డివిజన్లలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం కొనసాగుతోందని అధికారులు వివరించారు.

**డ్రోన్లతో సీడ్ బాల్స్ జల్లండి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో జాప్యం లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లాలని సూచించారు. అవసరమైతే డ్రోన్ల సంఖ్యను పెంచాలని, క్షీణించిన అటవీ ప్రాంతాల్లో పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీడ్ బాల్స్ వెదజల్లడంతో పని ముగిసినట్లుగా భావించకుండా, మొలకెత్తిన మొక్కలను సంరక్షించే బాధ్యతను కూడా అటవీశాఖ అధికారులు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ కార్యక్రమం కీలకమని, నిర్ణయించిన 30 వేల హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు.



# టమాటా ధరలపై తప్పుడు ప్రచారం చేయొద్దు




**అమరావతి, (ఉషశ్రీ), జులై 25:** టమాటా ధరలపై వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రైతులకు కిలోకు రూ.2 మాత్రమే లభిస్తోందంటూ తప్పుడు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో టమాటా సగటు ధర కిలోకు రూ.10.55గా ఉందని, అన్నమయ్య జిల్లాలో రూ.10.58, మదనపల్లె మార్కెట్‌లో రూ.11 ధర నమోదైందని మంత్రి వెల్లడించారు. వివిధ మార్కెట్లలో కనిష్టంగా రూ.6 నుంచి గరిష్టంగా రూ.16 వరకు ధరలు ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులకు కిలోకు రూ.2 మాత్రమే వస్తోందని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

**గిట్టుబాటు ధరకు అధికారులతో సమీక్ష :** టమాటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వ్యవసాయ మార్కెటింగ్, ఉద్యాన శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అధిక దిగుబడుల కారణంగా మార్కెట్లకు రాకలు పెరిగినా, సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించడం, దశలవారీగా నాట్లు వేయించడం వంటి ముందస్తు చర్యలతో సరఫరాను సమతుల్యం చేసే ప్రయత్నం చేశామని వివరించారు. జూలై నెలలో రోజుకు సగటున 5,000 నుంచి 5,500 మెట్రిక్ టన్నుల టమాటా మార్కెట్లకు వస్తోందని, ఇటీవల 6,000 నుంచి 7,000 మెట్రిక్ టన్నుల వరకు రాకలు నమోదయ్యాయని చెప్పారు. రాప్తాడు మార్కెట్‌లో భారీ లావాదేవీలు జరిగాయన్న ప్రచారం కూడా వాస్తవం కాదని, అక్కడ టమాటా రాకలే నమోదు కాలేదని మంత్రి స్పష్టం చేశారు. గత రెండేళ్లలో టమాటా ధరలు ఎప్పుడూ రూ.3 నుంచి రూ.6 మధ్యే ఉన్నాయన్న ప్రచారం కూడా అవాస్తవమని పేర్కొన్నారు. 2024, 2025లో పలు నెలల్లో టమాటా ధరలు దీనికంటే ఎక్కువగా నమోదయ్యాయని తెలిపారు.

**ఐదో తేదీ నుంచి కొనుగోలు మొదలుపెట్టాం :** రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపడుతున్న మార్కెట్ జోక్య చర్యల్లో భాగంగా ఈ ఏడాది జూలై 5 నుంచి ఇప్పటివరకు 261 టన్నుల టమాటాను కొనుగోలు చేసి, రైతు బజార్లలో 'నో లాస్--నో ప్రాఫిట్' విధానంలో వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతుల కష్టాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా, వారి సమస్యలకు పరిష్కారం చూపడంపై దృష్టి పెట్టాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.

# భక్తుల ఆనంద తాండవం







**కాకినాడ,జులై 25 ( ఉష శ్రీ ప్రతినిధి):** ఈ నెల 15న ప్రారంభమైన ఆషాడమాస వారాహి గుప్త నవరాత్రులు ముగిసిపోయాయి. దీక్షదారులు శనివారం మాలలు తీసివేశారు. ఆలయాలు బోసిపోయి కనిపించాయి. కరప మండలం కొరుపల్లిలోని కాశీ వారాహి ఆలయంలో ఉత్సవాలు ముగింపు సందర్భంగా వేకువఝాము నుంచి మాలల విసర్జన కార్యక్రమం జరిగింది. పది రోజులపాటు లక్షలాదిగా విచ్చేసిన భక్తులతో అంగరంగ వైభవంగా గుప్త నవరాత్రులు ముగియడంతో ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్బన్న సేవకులు కలిపి ఆనందపార వశ్యంతో నృత్యాలు చేశారు. అమ్మవారి వద్ద పడి వెలిగించి పడిపాట తరహాలో నృత్యాలు చేశారు. ఆనందంతో, ఆధ్యాత్మికతతో వారు చేస్తున్న నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలువురు మహిళా భక్తులు సైతం వారితో కలిపి నృత్యాలు చేశారు. ఆనందానికి అవధులు లేవు అన్న చందాన అమ్మవారి నామస్మరణతో ఈ కార్యక్రమం జరిగింది. పెనుగుదురు గ్రామనికి చెందిన ఓ భక్తుడి 8 గ్రాముల బంగారు మంగళ సూత్రాలు అమ్మవారికి బహుకరించారు. రూరల్ మండలం కొవ్వూరు దేవాదాయ శాఖకు చెందిన వారాహి దేవస్థానంలో శనివారం కూడా భక్తుల తాకిడి అధికంగా కనబడింది. ఆలయ ఈవో సిహెచ్ ఎస్ఎన్ఎస్ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించి గుప్త నవరాత్రులకు స్వస్తి పలికారు. నేటి నుంచి రోజు వారీ పూజలు జరుగుతాయి అన్నారు. రూరల్ రాయుడుపాలెంలోని హ్రిమ్ పీఠంలో మహా శక్తి యాగాలు ముగిసాయని పీఠం నిర్వాహకులు ఈశ్వర దత్ తెలిపారు. ఆషాడ నవరాత్రుల సందర్భంగా పీఠంకు తరలివచ్చిన భక్తులకు యాగాలు హోమలలో పాల్గొన్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# 'లెర్న్ - క్రియేట్ - ఎర్న్'తో మహిళల ఆర్థిక సాధికారతకు కొత్త దిశ

**ఎన్‌టీఆర్ జిల్లా/ఇబ్రహీంపట్నం, (ఉషశ్రీ), జులై 25:** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని సృజనాత్మకతతో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని, ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం పైప్ క్లీనర్‌తో హస్తకళా ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావ్స్ ఎండ్‌లెస్ క్రాఫ్ట్స్ వ్యవస్థాపకులు శ్రావణి 60 మంది స్వయం సహాయ సంఘాల మహిళలకు బొకేలు, అలంకరణ వస్తువులు, ఆకర్షణీయ బహుమతుల తయారీలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికారతకు బలమైన పునాదిగా నిలుస్తుందని అన్నారు. కొత్త నైపుణ్యాలను నేర్చుకుని వాటిని ఉపాధి అవకాశాలుగా మలచుకోవడం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఇంటి నుంచే ప్రారంభించగలిగే ఇటువంటి హస్తకళా ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, రైజ్ కేంద్రం అందిస్తున్న శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక యుగంలో ఈ-మార్కెటింగ్ అవకాశాలను కూడా అందిపుచ్చుకుని తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



# పొగాకు రైతులకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం



**అమరావతి, (ఉషశ్రీ), జులై 25:** రాష్ట్రంలోని పొగాకు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూనే, బయ్యర్లు కూడా సమస్య పరిష్కారానికి సహకరించాలని సూచించారు. పొగాకు రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి జరిపిన నిరంతర సంప్రదింపుల నేపథ్యంలో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ రాష్ట్రానికి వచ్చి సీఎంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్, టుబాకో బోర్డు అధికారులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి మూడు ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

**సమగ్ర విధానాన్ని రూపొందించాలి :** ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతం కాకుండా తాత్కాలిక చర్యలతో కాకుండా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని సీఎం అధికారులకు సూచించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, టుబాకో బోర్డు, రైతులు, బయ్యర్లు అందరూ భాగస్వాములుగా కలిసి పనిచేస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని, అవసరమైతే పొగాకును కొంతకాలం నిల్వ ఉంచే అవకాశాలను కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. తక్కువ, మధ్య, అధిక గ్రేడ్ పొగాకు మార్కెటింగ్‌పై ట్రేడర్లతో చర్చించి కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర వాణిజ్య శాఖ ప్రతినిధులతో కలిసి ప్రముఖ పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులకు మేలు చేసేలా ట్రేడర్లు కూడా సహకరించాలని కోరారు. రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి మంచి ప్రతిపాదనలతో రావాలని సూచించారు. ఈ అంశంపై సోమవారం మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

# ఆర్థిక అవగాహనతోనే ఆర్థిక భద్రత




**విజయవాడ, (ఉషశ్రీ), జులై 25:** ప్రజల్లో ఆర్థిక పరిజ్ఞానాన్ని పెంపొందించి, సురక్షితమైన బ్యాంకింగ్ సేవల వినియోగం, ప్రభుత్వ ఆర్థిక సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మార్గదర్శకత్వంలో జిల్లావ్యాప్తంగా ఆర్థిక విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను తెలిపారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం కృష్ణలంక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఆర్థిక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ప్రతి పౌరుడు బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, మహిళలు, యువత ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత సాధికారత సాధించాలని పిలుపునిచ్చారు. ఆర్థిక అవగాహన శిక్షకురాలు ఐ. విజయ దుర్గా మల్లీశ్వరి యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ లావాదేవీలను సురక్షితంగా నిర్వహించే విధానాన్ని వివరించారు. బ్యాంక్ ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు, పాస్‌వర్డ్లు వంటి గోప్యమైన వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పొదుపు, బీమా పథకాల ప్రయోజనాలు, బ్యాంకుల ద్వారా లభించే రుణాలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) సుబ్బయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పంచ సూత్రాలతో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొందాం



**ఎన్‌టీఆర్ జిల్లా/విజయవాడ, (ఉషశ్రీ), జులై 25:** ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు, దీర్ఘకాలం పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున ఉద్యాన పంటలను శాస్త్రీయ పద్ధతులతో సంరక్షించుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి పి. బాలాజీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిమిత నీటి వనరులు ఉన్న మామిడి తోటలు, మిరప సాగు ఆలస్యమయ్యే ప్రాంతాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ చేపట్టాలని తెలిపారు. పప్పు, నూనె, ధాన్య, పచ్చిరొట్ట పంటలు వేయడం ద్వారా నేలలో ఉష్ణోగ్రత తగ్గి, తేమ ఎక్కువకాలం నిలిచి పంటల స్థిరత్వం పెరుగుతుందని వివరించారు. వర్షపు నీరు, బోరుబావుల ద్వారా వచ్చే నీటిని నీటి కుంటల్లో నిల్వ చేసుకుని బిందు సేద్యం ద్వారా వినియోగిస్తే వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. నీటి కుంట నిర్మాణానికి రూ.18 వేల వ్యయం కాగా, అందులో 50 శాతం రాయితీని ఉద్యానశాఖ అందిస్తోందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే మిరప సాగు చేసిన లేదా వచ్చే నెలలో సాగు చేసే రైతులు జూలై 31లోగా రూ.1,800 ప్రీమియం చెల్లించి, ఎకరాకు రూ.90 వేల బీమా రక్షణను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పొందవచ్చని సూచించారు. తోటల్లో వీడ్ మ్యాట్లు పరచడం ద్వారా కలుపు నివారణతో పాటు నేలలో తేమ ఎక్కువకాలం నిల్వ ఉంటుందని, ఇందుకు ఎకరానికి రూ.1 లక్ష వరకు ఉద్యానశాఖ రాయితీ అందిస్తోందని తెలిపారు.

**రైతులకు పరికరాల రాయితీ :** ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద రైతుల కేటగిరీని బట్టి డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను 50 నుంచి 100 శాతం వరకు రాయితీతో పొందవచ్చని చెప్పారు. వీటి ద్వారా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణానికి సాగునీరు అందించడంతో పాటు విద్యుత్ వినియోగం తగ్గి, ఎరువులను సమర్థవంతంగా మొక్కలకు అందించవచ్చని వివరించారు. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రైతులు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాలు, ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి పి. బాలాజీ కుమార్ సూచించారు.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN